క్లుప్తంగా

చెరువుకట్ట అభివృద్ధికి చర్యలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని చెరువు కట్టపై నెలలో సుమారు పది నుంచి 15 వరకు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. శుక్రవారం చెరువు కట్టకు ఇరువైపుల ఉన్న కంపచెట్ల తొలగింపు పనులను ప్రారంభించారు. చెరువుకట్టను ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే పీడీ యాక్ట్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

బేస్తవారిపేట: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు భవిష్యత్‌లో పీడీ యాక్ట్ అమలు చేస్తామని కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లె, చెంచుగూడెంలో సీఐ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా అమ్మితే సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

కొమరోలు: విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని గోపాలునిపల్లె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాడిరైతు మాధవరావుకు చెందిన గేదెను ఇంటి పక్కనే ఉన్న బీడు భూమిలో మేతకు తోలాడు. సమీపంలోనే ఉన్న టాన్స్‌ఫార్మర్ నుంచి ఎర్త్ రావడంతో పాడిగేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.90 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

స్పందన స్కూల్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



బెస్ట్ స్కూల్ అవార్డు అందుకుంటున్న సుధీర్‌కుమార్‌రెడ్డి

రాచర్ల: దేశవ్యాప్తంగా అత్యుత్తమ విద్య అందిస్తూ విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తున్న పాఠశాలలకు బ్రెయిన్ ఫీడ్ సంస్థ అందించే ప్రతిష్టాత్మక స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు మండల కేంద్రమైన రాచర్లలోని స్పందన స్కూల్‌కు రెండోసారి దక్కింది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో స్పందన స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పేర్ల సుస్మితారెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు ఐఐటీ, అబాకస్, వేదిక్ మ్యాథ్స్, హ్యాండ్ రైటింగ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్పోర్ట్స్, స్పోకెన్ ఇంగ్లిష్ లాంటి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే అవార్డు వరించిందని సంతోషం వ్యక్తం చేశారు.

త్వరితగతిన ఇంటి ప్లాన్ల మంజూరు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ పరిధిలోని భవన నిర్మాణదారులు త్వరితగతిన ఇంటి ప్లాన్లు పొందవచ్చని కమిషనర్ నారాయణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థలం దస్తావేజు, నిర్ణీత రుసుం చెల్లించి లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నియమ నిబంధనల మేరకు ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన ప్లాన్ మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అనుమతి లేని కట్టడాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపు మకిలి..

కమిషనర్ బలి!

- మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌ను సాగనంపేందుకు టీడీపీ నేతల స్కెచ్
- పట్టణంలో ఆక్రమణల తొలగింపు పేరుతో అధికార టీడీపీ నేతల అరాచకం
- ఉపాధి కోల్పోయిన వందలాది మంది చిరువ్యాపారులు
- ట్రాఫిక్ కట్టడి పేరుతో ఫ్యాన్సీ స్టోర్లు, వస్త్ర వ్యాపారంపై వేటు
- వివాదాస్పద నిర్ణయాలపై పెల్లుబుకుతున్న జనాగ్రహం
- కమిషనర్‌పైకి నెపం నెట్టి బదిలీ చేసేందుకు రంగం సిద్ధం
- నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న అధికారిని రప్పించే యోచన

మార్కాపురం:

మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం లేకుండా మార్కాపురం పట్టణంలో ఆక్రమణల తొలగింపు పేరుతో అధికార టీడీపీ నేతలు సాగించిన అరాచకం అంతా ఇంతా కాదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు లేశమంతైనా విలువ ఇవ్వకుండా టీడీపీ నేతలు ఏకపక్షంగా వ్యవహరించిన తీరుపై ప్రజాగ్రహం పెల్లుబుకుతూనే ఉంది. అయితే ఈ తతంగంతో తమకేం సంబంధం లేదని తప్పించుకునేందుకు టీడీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసినట్లు తెలుస్తోంది. ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో తమకు అంటుకున్న బురదను తొలగించుకునేందుకు.. నెపమంతా కమిషనర్‌పై నెట్టి బలి చేయాలని టీడీపీ నేతలు సిద్ధమయ్యారని జోరుగా చర్చ నడుస్తోంది.

తప్పంతా కమిషనర్‌దేనా?

మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌గా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన నారాయణరావుకు నిజాయితీగల అధికారిగా పేరుంది. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి తీవ్రంగా ఒత్తిడి చేయడంతో గత నెలలో పట్టణంలో ఆక్రమణలు తొలగించారు. అధికార పార్టీ నేతల తీరుతో కొన్ని చోట్ల ఆక్రమణల తొలగింపు వివాదాస్పదమైంది.



మార్కాపురం మున్సిపాలిటీ

అయితే పట్టణంలో ప్రధాన సామాజికవర్గానికి చెందిన పలువురు వ్యాపారులు ఆక్రమణల పేరుతో తమను వీధినపడేశారని అధికార పార్టీ నాయకులను దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ నెపాన్ని కమిషనర్‌పై నెట్టేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనను ఇద్దరు కౌన్సిలర్లు ముఖ్య ప్రజాప్రతినిధి చెవిన వేశారు. ఆక్రమణల తొలగింపులో వచ్చిన చెడ్డపేరు పోగొట్టుకునేందుకు కమిషనర్ బదిలీనే చక్కటి మార్గమని నిర్ణయించుకుని పక్కాగా స్కెచ్ వేశారు. నెల్లూరు జిల్లాలోని ఓ మున్సిపాలిటీలో పనిచేస్తున్న అధికారిని మార్కాపురం కమిషనర్‌గా నియమించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఉద్యోగులు 'ఔరా..' అని ముక్కున వేలేసుకుంటున్నారు. దగ్గరుండి మరీ ఆక్రమణలు తీయించినవారే కమిషనర్ బదిలీకి ప్రయత్నిస్తుండటంతో విస్తుపోతున్నారు. వాస్తవానికి గత రెండు నెలలుగా మున్సిపాలిటీలో గాడితప్పిన పాలనను కమిషనర్ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి పని నిబంధనల ప్రకారం చేస్తానని కూటమి కౌన్సిలర్లకు, నాయకులకు చెబుతుండటంతో ఆ మాటలు వారికి మింగుడుపడట లేదు. పైగా ఆక్రమణల తొలగింపుతో పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చింది. కమిషనర్‌ను బదిలీ చేస్తే అన్నీ చక్కబడతాయని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

అనుకున్నదొకటి.. అయినదొకటి

ఎన్నికల్లో మార్కాపురం పట్టణంలో ప్రధాన సామాజిక వర్గ ఓటర్లు టీడీపీ అభ్యర్థి వైపు మొగ్గు చూపారు. తమకు అండగా ఉంటారని భావించారు. అయితే గత నెలలో ఆక్రమణల తొలగింపు పేరుతో కళాశాల రోడ్డు నుంచి మెయిన్ బజారు, కంభం సెంటరు, అమ్మవారిశాల వీధి, నాయుడుబజారు, తూర్పు వీధి, రథం బజారు, పాత బస్టాండు ప్రాంతంలో జేసీబీలతో దండయాత్ర చేశారు. కాలువలపై బంకులు పెట్టకూడదని, రేకులు వేశారని, మెట్లు కట్టుకున్నారని ఇలా రకరకాల కారణాలు చూపారు. ఇదంతా అధికార పార్టీ నేతలే చేయించినప్పటికీ మొదట్లో కమిషనర్ పేరును తెరపైకి తెచ్చారు. నియోజకవర్గ ముఖ్యనేత ఆదేశాలతోనే ఈ తంతు సాగిందని వ్యాపారులకు అవగతమైంది. ఓట్లేసి గెలిపించినందుకు తగిన న్యాయం చేశారంటూ వ్యాపారులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. గతంలో కాలేజీ రోడ్డు, పాత బస్టాండ్ మీదుగా తిరిగే ఆర్టీసీ బస్సులను 15 రోజుల నుంచి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో విశ్వేశ్వర థియేటర్, రాధాకృష్ణ థియేటర్, తూర్పువీధి, రథంబజారు, అమ్మవారిశాల, కంభం సెంటరు మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు పంపుతున్నారు. దీంతో ప్రధాన వీధిలో ఉన్న సుమారు 100కు పైగా వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు, కిరాణా షాపులన్నీ వ్యాపారాలు లేక బోసిపోయాయి. షాపుల ముందు పార్కింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకపోవడంతో ప్రజలు నిత్యావసర వస్తువులు, ఇతరత్రా సామగ్రి కొనేందుకు బయట ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇదంతా తమపై కక్ష సాధింపేనని వ్యాపారులు విశ్వసిస్తుండటంతో ఆ చెడ్డ పేరును తొలగించుకునేందుకు కమిషనర్‌ను బలిపశువును చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



కంభంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

- గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి
- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కంభం: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతమయ్యేలా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటోందని మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కంభంలో పార్టీ నాయకులు, సర్పంచులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలపై, సోషల్ మీడియా యాక్టివిస్టులపై పెడుతున్న అక్రమ కేసులు, సర్పంచులు పడుతున్న ఇబ్బందుల గురించి పలువురు నాయకులు కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గాల వారీగా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు సమావేశాలు నిర్వహించి నూతన కమిటీలను నియమిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి పోతిరెడ్డి, నన్నెబోయిన రవికుమార్ యాదవ్, సబ్బసాని సాంబశివారెడ్డి, రసూల్, రఫీ, సయ్యద్ సలీం, హుస్సేన్ బాష, రామ్మూర్తి, పెద్దకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొలాల్లో వర్షం నీటిని బయటకు పంపాలి



ఆకవీడులో మిరప తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి గోపిచంద్

రాచర్ల/కొమరోలు/పొదిలిరూరల్: భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటికి పంపాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్ సూచించారు. రాచర్ల మండలం ఆకవీడులో మిరప తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మిరపలో తామర పురుగు, తెల్లదోమ నివారణకు సూచనలిచ్చారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి విష్ణుప్రియ, వీఏఏలు ఉన్నారు.

కొమరోలు మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. గోనపల్లె గ్రామంలో దెబ్బతిన్న శనగను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఆయన వెంట గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్, జిల్లా టెక్నికల్ అధికారి శ్రీనివాసనాయక్, ఏఓ రాజశ్రీ ఉన్నారు.



అన్నవరంలో దెబ్బతిన్న వరి పంట

వర్షానికి తుడిచిపెట్టుకుపోయిన వరి

పొదిలి మండలంలోని అన్నవరం గ్రామంలో రైతు పులి నాగిరెడ్డి ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరి కోత దశలో కురిసిన వర్షానికి తుడిచిపెట్టుకుపోయింది. మొక్కలతోపాటు గింజలు కూడా రంగు మారాయని వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దిన్ తెలిపారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు.

కొత్త కార్డులకు మోక్షమెప్పుడో?

- కొత్త రేషన్‌కార్డుల మంజూరుపై నేటికీ వెలువడని మార్గదర్శకాలు
- 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జోరుగా ప్రచారం
- నిజమని నమ్మి సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ప్రజలు

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా.. కూటమి సర్కారు ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయలేదు. ఈనెల 2వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని జోరుగా ప్రచారం సాగడంతో అర్హులైన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సిబ్బంది చెబుతుండటంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. సిబ్బంది అక్కడక్కడా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం సర్కారు ఇవ్వలేదు. కూటమి మంత్రులు సైతం ఈనెల 2వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉందని గతంలో సెలవిచ్చారు. కొత్త వాటితో పాటు పాత కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. కానీ ఇప్పటికీ మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో అర్హులకు భంగపాటు తప్పలేదు. కొత్త రేషన్‌కార్డులతో పాటు ఉన్న కార్డుల్లో అనేక తప్పులు దొర్లాయి. మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తే తప్ప వీటిని సరిచేసే అవకాశం లేదు. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు, పాత వాటిల్లో మార్పులు, చేర్పుల కోసం గత ఆరు నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు.



ఆన్‌లైన్‌లో తెరచుకోని వెబ్‌సైట్

విన్నపాలు.. విలాపాలు

సాక్షి నెట్‌వర్క్: గ్రామాల్లో దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రెవెన్యూ సదస్సులు మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో మొదటి రోజు శుక్రవారం మొక్కుబడిగా సాగాయి. తాము ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని భావించిన ప్రజలను గ్రామ సభలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. పలు గ్రామాల్లో అర్జీలిచ్చేందుకు జనం ముఖం చాటేయడంతో సిబ్బంది వీధుల్లో తిరిగి సదస్సు వద్దకు పిలుచుకెళ్లిన పరిస్థితులు కనిపించాయి. జనం లేకపోవడంతో నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా సదస్సులు ప్రారంభించి, ముందుగానే ముగించేశారు.

- పొదిలి మండలంలోని మల్లవరంలో ఉదయం 10.20 గంటల వరకు ఎవరూ రాలేదు. ఆ తర్వాత అధికారులు ఒక్కొక్కరుగా వచ్చారు. సాయంత్రం 4.40కి స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రాగా భూ సమస్యలపై 8 మంది అర్జీలు అందజేశారు.
- మార్కాపురం మండలం నాగులవరం గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఓ మహిళ విజ్ఞప్తి చేసింది. రెండు లేదా మూడు రోజులకోసారి ట్యాంకర్లతో నీరు ఇస్తుండటంతో ఇబ్బందిగా ఉందని సమస్యను వివరించింది. రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన కరువవడంతో ఎమ్మెల్యే హడావుడిగా వెళ్లిపోయారు.
- కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్లలో 32 అర్జీలు అందజేశారు. శ్మశానం ఆక్రమణపై విచారించి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే కందుల సూచించారు.
- నిన్నా మొన్నటి వరకు పలకల గనుల్లో కూలీ పనులు చేసుకుంటూ బతుకీడ్చాం. ప్రస్తుతం గనుల్లో పని లేకపోవడంతో వలస పోవాల్సి వస్తోంది. ప్రభుత్వ భూమిని కేటాయిస్తే వ్యవసాయం చేసుకుని జీవిస్తాం' అని ఎమ్మెల్యే కందులకు బుద్ధపల్లి గ్రామానికి చెందిన వడ్డెరలు మొరపెట్టుకున్నారు.
- గిద్దలూరు మండలంలోని అంబవరంలో రేషన్ కార్డులు, పేరు మార్పుల కోసం 44 అర్జీలు, పట్టాదారు పాసుపుస్తకాల కోసం 14 అర్జీలు వచ్చాయి. వెంగళరెడ్డిపల్లెలో వివిధ సమస్యలపై 35 అర్జీలు వచ్చాయి. సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు.



10.40కి ప్రారంభమైన రైతు సదస్సుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు



నాగులవరంలో నీటి సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మహిళ



కంభం ఎస్సీ కాలనీలో సొంత గృహాలు లేనివారిని గుర్తిస్తున్న తహసీల్దార్

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, మాలమహానాడు రాష్ట్ర సెక్రటరీ గుల్ల చిన్నసుబ్బయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు దార్ల ప్రేమ్‌కుమార్, మండల అధ్యక్షుడు దార్ల బాబు, నాయకులు మిరియాల శేఖర్ పాల్గొన్నారు.

కంభం: స్థానిక కందులాపురం కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ వీరభద్రాచారి, కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ(రజని), చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు. బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దాసరియోబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కంభం ఎస్సై నరసింహారావు, కొత్తపల్లి విజయ్, అరుణ్‌దీప్, దాదా, విశ్రాంత సీటీఓ మీనిగ ప్రసాద్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

రాచర్ల: రాచర్లలో ఎంపీపీ షేక్ ఖాశింబీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కృషి ఎనలేనిదని కొనియాడారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, షేక్.ఇస్మాయిల్, సోమవరపు ఆరోగ్యం, పరదేశి రాజశేఖర్, చిట్టెం ఆశీర్వాదం పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిరస్మరణీయులని గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేపీ మాట్లాడుతూ.. అంబేడ్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆచరణీయంగా మారిందన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ బాటలు వేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైస్ ఎంపీపీ నోయల్, కొమరోలు జెడ్పీటీసీ వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలి రామక్రిష్ణారెడ్డి, సీఆర్‌ఐ మురళి, బాదం గోపాల్, వెంగయ్యచౌదరి, ఓబుల్‌రావు, పగడాల వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, సునిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నగర పంచాయతీ అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



గిద్దలూరులో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కోర్టు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సిరాజ్, 11వ వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, జగనన్న దళిత సేన రాష్ట్ర నాయకులు బూదాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నందం శేఖర్, మండల అధ్యక్షులు లింగాల రామయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు కె.అబ్బన్న, బీసీ నాయకులు రామాంజనేయులు, దానమయ్య, జాన్సన్, రాము, గాలెయ్య, రమణ తదితరులు నివాళులర్పించారు. స్థానిక ఆకాశవాణి కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బేస్తవారిపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్

- డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, పీడీ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ రెహానా, సతీష్, సుభానీ, రామయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు పిల్లి బాలనరసయ్య, కొండయ్య, ఏసేబు తదితరులు నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ పి.అంజిరెడ్డి, ఎస్సీసెల్ నాయకులు పి.పిచ్చయ్య, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురం : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రాహుల్, సిరాజ్ తదితరులు